# పత్రికలూ - రచయిత (త్రి) లూ - పాఠకులూ

## వాసిరెడ్డి సీతాదేవి

"ఆడపేర్లతో రాసే మగవాళ్ళు ఎక్కువై పోయినట్టున్నారు" అన్నాడు ఓ పెద్దమనిషి నాతో.

"ఏమిటి? విశేషం!" అని అంగ లేదు కాని—ఆ అర్థం స్ఫురించే లా చూశాను

'అదేనండీ ఆ మధ్య ఒక ప్రముఖ పత్రికలో ఆడపేరుతో ప్రారంభంఅయిన ఒక నవల చదివాను. నవల పూర్తి అయ్యాక ఒక మగవాడి ఫొటో వేసి, పేరు రాశారు. ఆ ఆడపేరు ఆయన పెన్ నేమ్ అట. ఇదేం అన్యాయం?" అన్నాడు.

"మీరు ఆ పత్రిక వాళ్ళనే అడ గాల్సింది.

"పత్రిక లేం చేస్తాయండీ? రాసే వాళ్ళది తప్పుగాని! అన్నాడు ఆ పెద్ద మనిషి.

మగపేరుతో వస్తే మీరు ఆ నవల చదివే వారేనా?" అడిగాను ఆ పెద్ద మనిషి ఓ క్షణం ఆలోచించాడు.

- నిజమేలెండి. మరో కొత్త రచయిత్రి మా ప్రాణానికి దాపరించింది — ఎలా రాసిందో చూద్దాం అని ప్రారంభించాను. సీరియల్ గదా మరి! ఒక సారి ప్రారంభిస్తే ఆపబుద్ధికాదాయే. అందుకే చివరి వరకూ చదివాను" అన్నాడు.

"మగవాళ్ళు ఆడపేరుతో రాయడానికి మీ పాఠకులూ, పత్రికలే కారణం. అనవసరంగా రచయిత లెన్నెందుకు నింది స్తారు?" అన్నాను.

'అదేమిటి! చివరకు మామీదే ఈ అపరాధం తోసేశారు?' అంటూ కిక్కురుమనకుండా వెళ్ళిపోయాడా పెద్ద మనిషి.

### ఆడపేరూ—మొగ కథా—

ఆడపేర్లు వుంటేగాని పాఠకులు చద వడం లేదని పత్రికల వాళ్ళు అంటు న్నారు.

ఆ మధ్య ఒక యువరచయిత నాదగ్గరకు వచ్చాడు. ఒకటేగొడవ పెట్టేశాడు. ఆయన చాలా తెలివైనవాడు, బాగా చదువుకున్న వాడు, సృజనాత్మక ప్రతిభ కలవాడు. మంచి విమర్శకుడు. అప్పటికే ఒకనవల రెండుప్రింటులు వచ్చింది. ఆ పద్ధతితో రాసిన నవల తెలుగులో అంతకుముందు రాలేదు ఆ వలకు మంచి పేరు వచ్చింది. బాగా చదువుకున్న వారి మన్ననలు పొందాడు ఆ రచయిత.

ఆ ఉత్సాహంతో మరో నవలరాశాడు. అది అచ్చువేయించడం ఆయనకు ఓ పెద్ద సమస్యగా తయారైంది. నిరాశా నిస్పృహ లతో బాధపడ్డాడు.

"మాలాంటి వాళ్ళం ఎందుకు రాయా లండీ? మా నవలల్లో ఇడియాటిక్

Grams : AUTOMOBILE Phones : 61384-85

# BHARAT AUTO ENTERPRISES

P. B. No. 702

**BUNDAR ROAD : : VIJAYAWADA-10.**

★

*Authorised Sub-Dealers for*

*Krishna & West Godavari Districts :*

PREMIER PADMINI CARS

PREMIER ROADMASTER TRUCKS

PREMIER ROADMASTER BUSES

PREMIER ROADMASTER VANS

*Agents for :*

**'TVS' BODY CONSTRUCTION ON ANY BUS CHASSIS**

**LUBRICATION SERVICE**

**GENUINE SPARE PARTS**

**WHEEL ALIGNMENT TO AVOID PREMATURE**

*Uneven Tyre wear our Speciality.*

---

*Repairs Undertaken for all Vehicles.*

ప్రేమలూ, అర్థంలేని త్యాగాలూ, అపార్థాలూ ఉండవు.

ఆరు అడుగుల ఎత్తు హీరోలూ, సోగకళ్ళ అమ్మాయిలూ వుండరు నా హీరోకు రైలు నడపడంతో పాటు అవసరం అయితే హెలికాప్టర్ నడపడం రాదు. నా హీరోయిన్ కళ్ళలో అందమైన కలలు వుండవు. వుంటే కన్నీళ్ళువుంటాయేమో గాని - గుండెలో స్పందనలు వుండవు-సమస్యల బరువు వుండొచ్చు-జీవితం కలగా భ్రమించే సంఘటనలూ-పాత్రలూ వుండవు ఎవరేస్తారండీ !" అంటూ కసిగా ఏదేదో అన్నాడు.

అతని మాటల్లో ఎంతో నిజం వుంది. ఆడపేరుతో పంపిస్తేఅతని నవలవెంటనే అచ్చు అవుతుంది.

ఇక పత్రికల వాళ్ళంటారు - మేము దేశాన్ని ఉద్ధరించాలని పత్రిక పెట్టలేదు. పాఠకులకు కావలసిన సరుకు అందించి నాలుగు డబ్బులు సంపాదించు కోవడం మా లక్ష్యం. ప్రస్తుతం ఆడవారినవలలకే గిరాకి ఉంది.

పాఠకుల స్థాయిని ఈ పత్రికల వాళ్ళు ఎలా అంచనా కడ్తున్నారు? పత్రికలకు వచ్చే ఉత్తరాలను బట్టేగా?

## ఇలా వుంటాయి ఉత్తరాలు

'హృదయం పగిలింది' నవల ఎంతగానో ఆకర్షించింది. ఆ నవల రచించిన రచయిత్రి రాధాదేవిగారు ప్రశంసనీయులు. కాని కథను వారు ఏ ఉద్దేశంతో నడిపించారో అర్థంకాలేదు. ఇది నేను కల్పించిన ఉత్తరంకాదు. నేను ఒక పత్రికలో చదివిన ఉత్తరం, పేర్లు వేరు కావచ్చు.


కథ ఏ ఉద్దేశ్యంతో నడిపించారో ఆ పాఠకుడికి అర్థం కాలేదట. కాని ఆ నవల తనను ఎంతగానో ఆకర్షించిందట. ఆ నవల రచించిన ఆమె ప్రశంసనీయులట.

మరో ఉత్తరం- "మీ పత్రికలో ధారావాహికంగా ప్రచురించిన 'వెలుగు' నవల ముగిసి పత్రికకే వెలుగు నిచ్చింది. అటువంటి మంచి నవలను ప్రచురించిన మీకు, రచించిన రచయిత్రికీ మా ధన్యవాదాలు."

వెలుగు అనే నవల ముగిసి పత్రికకు వెలుగు వచ్చిందట. అంటే అది అచ్చు అయినంత కాలం ఆ పత్రికలో చీకటి వుందనేగా?

ఇలా వాళ్ళేం రాస్తున్నారో వాళ్ళకే అర్థంకాని పాఠకులు ఉత్తరాలను బట్టి రచయితలకు విలువ కడుతున్నారు పత్రికా సంపాదకులు. ఆ ఉత్తరాలు రాసే వాళ్ళు ఎక్కువమంది అచ్చులో తమ పేరు చూసుకోవాలనే వ్యామోహం గల వారే. బాగా లేదని వ్రాస్తే వెయ్యరని వారి భయం. అప్పుడప్పుడు మాత్రం బాగాలేదని వ్రాస్తే ఉత్తరాలు కూడా వేస్తారు, కాని అందరి రచయిత్రుల, రచయితల గురించి వచ్చే ఉత్తరాలు నిష్పక్షపాతంగా వెయ్యరు. ఈ సంపాదకులకు కొందరంటే ప్రత్యేక అభిమానం ఉంటుంది. వారు అభిమానించే వారి రచనల గురించి విమర్శిస్తూ ఎవరైనా రాసినా వెయ్యరు.

బాగా చదువుకున్న వారూ, విమర్శించే శక్తిగల వారూ కూడా నవలలు చదువుతారు. అయితే, వారు




పత్రికలకు ఉత్తరాలు రాయరు, బాగున్న నవల గురించి స్నేహితులతో, తెలిసిన వారితో చర్చిస్తారు. ఉత్తరాలు రావు గనక—కొన్ని నవలలు మంచివని ఒప్పుకుంటూనే — మాకు కావల్సింది పాఠకులు అభిమానించే నవలలుమాత్రమే అంటూ— వాటిని భద్రంగా రచయితలకు తిప్పి పంపిస్తారు.

## పాఠకులదేనా బాధ్యత ?

రచయితలు పత్రికల్ని నిందిస్తున్నారు, పత్రికలు పాఠకులదే బాధ్యత అంటున్నాయి. ఏది ఏమైనా రచయితలూ, పత్రికలూ కలిసి పాఠకుల్ని ఎక్స్‌ప్లాయిట్ చేస్తున్నారు. వారిస్థాయిని పెంచడానికి ప్రయత్నించడం లేదు. "రోజు రోజుకూ కొత్త పత్రికలు పెరిగిపోతున్న ఈ రోజుల్లో పాఠకులు ఎక్కువ మంది మీమా పత్రికకు ఫలానా నవల ఆణిముత్యం" అనే స్థాయినుంచి పెరగక పోవడమే మంచిది. ఎంతో మాటర్ కావాలి ఏ చెత్తయినా, ఎంత అభూతకల్పనలైనా ఆవురావురు మంటూ చదివే పాఠకులు కావాలి. అప్పుడే ఈ పత్రికలన్నీ బతికి పది కాలాల పాటు డబ్బులు సంపాదించుకో గలవు.

పాఠకుల అభిరుచి పెరిగితే కష్టం! మంచి రచనలు ఎప్పుడూ సంఖ్యలో తక్కువే వుంటాయి గనక పత్రికల పేజీలు నిండవు.

ఇటువంటి పాఠకులు నాలుగు కాలాల పాటు వర్ధిల్లి పత్రికల సంఖ్యను, రచయిత్రల సంఖ్యనూ పెంచుతారని ఆశిద్దాం.

మగవారు ఆడపేర్లతో రాసి ఇంకా ఇంకా పత్రికల వాళ్ళను ప్రోత్సహిస్తారనీ, అశేష పాఠకుల (మీ మా పత్రికలో రాచకొండ వారి కథ, సుందరపు సుందరమ్మ కథ రెండు హైలైట్సు అని (వ్రాసే పాఠకుల) ఆదరాభిమానాలను చూడ గొంటారనీ ఆకాంక్షిద్దాం!